
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.7 / కనిష్ఠం 12.4



కామారెడ్డి
జిల్లా వార్తలు
5
మంగళవారం 2 డిసెంబరు 2025



మాట్లాడుతున్న కలెక్టర్ అశిష్ సాంగ్వాన్

పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి

» కలెక్టర్ అశిష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, డిసెంబరు 01 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అశిష్ సాంగ్వాన్, జిల్లా సాధారణ పరిశీలకుడు సత్యనారాయణరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలింగ్‌లో వినియోగించే బ్యాలెట్ బాక్స్‌ల పంపిణీ, భద్రత, నిలువ, రవాణ, సిలింగ్ వంటి అంశాలపై గ్రామ పంచాయతీ నోడల్ అధికారులకు కేటాయించిన విధులను ఎలాంటి పొరపాట్లు లేకుండా సజావుగా నిర్వహించాలని సూచించారు. అభ్యర్థుల ఖర్చులకు సంబంధించిన వివరాలు ఎక్స్పెండేచర్ నోడల్ అధికారి, బ్యాలెట్ పేపర్లను బాలెట్ అధికారి రాజకీయ ప్రకటనలకు సంబంధించి మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్, జడ్పీ సీఈవో చందర్‌నాయక్, నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



తాడ్వాయిలో మాట్లాడుతున్న ఎన్నికల పర్యవేక్షణాధికారి

'స్థానిక' ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

» రాష్ట్ర ఎన్నికల పర్యవేక్షణ అధికారి

తాడ్వాయి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ సత్యనారాయణ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ఎన్నికల ప్రొసెసింగ్ ఆఫీసర్ల శిక్షణ తరగతులకు హాజరై మాట్లాడారు. ఇందులో డీపీవో మురళీ, డీఈవో రాజు, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీవో సవితారెడ్డి, తదితరులు ఉన్నారు.

లింగంపేట: మండలంలోని లింగంపల్లి(ఖుర్దు) గ్రామం, అలాగే మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్వీకరిస్తున్న నామినేషన్ కేంద్రాలను సోమవారం రాష్ట్ర అధికారి సత్యనారాయణరెడ్డి పరిశీలించారు. ఎన్నికలను సజావుగా జరిగేలా చూడాలని స్థానిక అధికారులను ఆదేశించారు.



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఆర్డీవో పార్థసింహారెడ్డి


సరిహద్దులో చెక్‌పోస్టు తనిఖీ


నాగిరెడ్డిపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మెదక్-కామారెడ్డి జిల్లాల సరిహద్దు గ్రామమైన పోచారంలో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రత్యేక చెక్ పోస్టును సోమవారం ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను పూర్తిగా అధికారుల నిఘా నీడలో నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ రంగం సిద్ధం చేసింది. ప్రత్యేక పోలీసు బలగాలతో, అధికారులతో నగదు, మద్యం, ఇతర ప్రలోభాలకు గురి చేసే వస్తువులను తరలించకుండా అడ్డుకట్ట వేసేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టారు.



నేతల.. బుజ్జగింపులు

ఈసారి ఎలాగైనా.. సర్పంచ్ పదవి దక్కించుకునేందుకు ఆయా పంచాయతీల పరిధిలో పోటీ లేకుండా పలువురు అభ్యర్థులు బుజ్జగింపు చర్యలు మొదలు పెట్టారు. కామారెడ్డి మండలంలోని క్యాసంపల్లిలో సర్పంచ్ స్థానానికి 8 నామినేషన్లు వచ్చాయి. అయితే ఓ అభ్యర్థి తనకు ఈ సారి అవకాశం ఇవ్వాలంటూ నామినేషన్ వేసిన ఇతరులను విత్‌డ్రా చేసుకోవాలంటూ వేడుకుంటున్నారు. అభ్యర్థికి మద్దతు తెలుపుతున్న నేతలు ఇతర నామినేషన్లను ఉపసహరించుకునేందుకు బుజ్జగింపు చర్యలు చేపట్టడం గమనార్హం.





కామారెడ్డి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఒక్క క్యాసంపల్లిలోనే కాకుండా అంతాటా పోటీ నెలకొంటున్న పలు పంచాయతీల్లో ప్రధాన పార్టీలకు చెందిన మద్దతుదారులకు రెబల్స్ బెడద ఎదురవుతోంది. బుధవారం మొదటి విడుత నామినేషన్ల ఉపసంహరణ ఉన్నందున ఆలోపు పోటీలో ఉన్న పలువురి నామినేషన్లు వెనక్కి తీసుకునేలా నేతలు సంప్రదింపులు చేపడుతున్నారు. అంతే కాకుండా జిల్లాలో ఇప్పటికే కామారెడ్డి డివిజన్ పరిధిలోని పది మండలాల్లోని ఆయా గ్రామ పంచాయతీల్లో నామినేషన్‌ల ప్రక్రియతో పాటు పరిశీలన ముగిసింది.

రేపు తేలనున్న అభ్యర్థుల సంఖ్య

మొదటిదశ పంచాయతీ ఎన్నికల నామినేషన్‌ల పర్వం ఇదివరకే ముగిసిన విషయం తెలిసిందే. మొదటి రెండు రోజులు తక్కువగా నామినేషన్‌లు దాఖలు అయినా.. చివరి రోజు పోటీ చేయాలనుకునే అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్‌లు వేశారు. బరిలో ఎవరు ఉంటారు? ఎవరు విత్‌డ్రా చేసుకుంటారనేది? బుధవారం తేలనుంది. నిన్న, మొన్నటి వరకు బరిలో ఉంటామనుకునే వారు చివరికి పోటీ నుంచి తప్పుకుంటున్నారు. దీంతో కొత్త ముఖాలు తెరపైకి వస్తున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు తక్కువగా ఉండడంతో అభ్యర్థులు ప్రతీ ఓటును కీలకంగా భావిస్తున్నారు. ముఖ్యంగా ప్రధాన పార్టీల నుంచి మద్దతు పొందుతున్న అభ్యర్థులకు పోటీలో ఉన్న మిగితా వారు అడ్డంకిగా మారబోతున్నారు.

సర్పంచ్ పదవి కోసం ఆ(పో)రాటం!!

» ప్రధాన పార్టీల మద్దతుదారులకు రెబల్స్ బెడద
» గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశం
» బుజ్జగించేందుకు నేతల ముమ్మర యత్నం
» నామినేషన్‌లు ఉపసంహరణకు ప్రయత్నాలు
» పల్లెల్లో ఆసక్తిగా పంచాయతీ రాజకీయం
» ఇప్పటికే ముగిసిన మొదటి విడుత నామినేషన్ల ప్రక్రియ
» రేపు తేలనున్న బరిలో ఉండే అభ్యర్థులు

దీంతో బరిలో నిలిచిన వ్యక్తులతో కొందరు బేరసారాలకు తెరలేపారు. పెద్ద గ్రామ పంచాయతీలు, మండల కేంద్రాలుగా ఉన్న పంచాయతీల్లో గెలుపును ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. అదేవిధంగా అసెంబ్లీ ఎన్నికల్లో నడిచిన ధన ప్రభావం నుంచి ఇక పల్లెలు బయటపడక పోవడంతో బలంగా ఉన్న అభ్యర్థులు ఖర్చు పెట్టడానికి కూడా వెనుకాడడం లేదంటున్నారు.

మేజర్ పంచాయతీలే లక్ష్యం..

జిల్లాలోని మొదటి విడుతలో 10 మండలాల్లోని 167 గ్రామ పంచాయతీలు 1,520 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో ముఖ్యంగా మేజర్ గ్రామ పంచాయతీలు, మండల కేంద్రాలుగా ఉన్న పంచాయతీల్లో గెలుపొందడానికి ప్రధాన పార్టీల మద్దతు ఉన్న పలువురు

(తరువాయి 8వ పేజీలో....)

3 నుంచి మూడవ విడత నామినేషన్లు షురూ

బాన్సువాడ టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం నుంచి మూడవ విడత నామినేషన్ల ప్రక్రియ షురూ కానుంది. మొత్తం 25 గ్రామ పంచాయతీలుండగా 8జీపీలలో అధికారులు నామినేషన్లను స్వీకరించనున్నట్లు ఎంపీడీవో ఆనంద్ తెలిపారు. దేశాయిపేట, బోర్లం, ఇబ్రహీంపేట, కోనాపూర్ , తాడ్కోల్, ఎంపీడీవో కార్యాలయం, తిర్మలాపూర్, హన్మాజీపేట పంచాయతీలలో ఆయా గ్రామాల సర్పంచ్ అభ్యర్థులు తమ నామినేషన్‌ను దాఖలు చేయవచ్చన్నారు. ఈనెల 3, 4, 5వ తేదీలలో నామినేషన్ల స్వీకరణ, 6న నామినేషన్ల పరిశీలన, 7, 8న అబ్జెక్షన్స్ స్వీకరణ, 9న విత్‌డ్రా చివరి తేదీగా ఉంటుందని ఆయన తెలిపారు. 17న ఎలక్షన్ జరుగనుందని ఆయన పేర్కొన్నారు.



వేడెక్కుతున్న.. పల్లె రాజకీయం

సమీపిస్తున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు

» కుల సంఘాలతో ఆయా పార్టీల నేతల సంప్రదింపులు
» కొన్ని గ్రామాల్లో ఒక్కటవుతున్న బీజేపీ, బీఆర్ఎస్
» ఏకగ్రీవానికి గ్రామపెద్దల చర్చలు
» కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారిన పంచాయతీ ఎన్నికలు

పల్లెల్లో రాజకీయాలు.. రోజురోజుకూ వేడెక్కుతున్నాయి. పంచాయతీ ఎన్నికలు సమీపిస్తుండడంతో గ్రామ ప్రథమ పౌరుడి స్థానం కైవసం చేసుకునేందుకు సర్పంచ్ అభ్యర్థులు కై కడుతున్నారు. ఎంత ఖర్చయినా పర్వాలేదంటూ పల్లె పోరుకు సిద్ధమవుతున్నారు. ఇటు కుల సంఘాలు, అటు మహిళలు, యువత ఓట్లను కూడగట్టేందుకు సంప్రదిందపులు జరుపుతున్నారు.



బాన్సువాడ రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల సమయంలో సమీపిస్తున్న కొద్దీ గ్రామాల్లో రాజకీయాలు వేడెక్కాయి. తమ అభ్యర్థుల గెలుపు కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నేతలు వ్యూహాలు రచిస్తున్నారు. స్థానిక ఎన్నికలను ప్రధాన పార్టీలు నాయకులు సవాల్‌గా తీసుకుంటున్నాయి. కొన్ని గ్రామాల్లో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఒక్కటై ఒకే వ్యక్తికి మద్దతిచ్చి గెలిపించుకోవాలని యోచిస్తున్నారు. దీన్ని సవాలుగా తీసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ సైతం తమ అభ్యరులను గెలిపించుకునేందుకు ఎత్తులకు పైఎత్తులు వేస్తోంది. తమ అభ్యర్థి గెలుపు కోసం కులసంఘాల మద్దతును కూడగట్టేందుకు పెద్దలతో ఆయా పార్టీలు సంప్రదింపులు జరుపుతున్నారు.

కులాల మధ్య చిచ్చు..

గ్రామ పంచాయతీ ఎన్నికలు కులాల మధ్య చిచ్చు పెడుతున్నాయి. బాన్సువాడ మండలంలోని హన్మాజీపేట్, కోనాపూర్, సంగోజీవాడి, తాడ్కోల్, కొత్తబాద్, ఇబ్రహీంపేట్ తదితర గ్రామాల్లో కులాల్లో కొందరు గ్రూపులుగా విడిపోయారు. కొందరు నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఒక్కో కులంలో రెండు, మూడు గ్రూపులుగా విడగొట్టి వాట్సాప్‌లలో చేరుస్తున్నారు. తమకు అనుకూలంగా ఉన్న యువకులకు విందులు ఏర్పాటుచేసి కులస్థులందరి మద్దతు తమకే ఇవ్వాలంటున్నారు. వీరి మాయలో పడిన కొందరు యువకులు వారి చెప్పింది చేస్తుండడంతో కులాల్లో చిచ్చు కు కారణమవుతున్నారు. కొంతమంది యువకులు ఉద్యోగాలు, మరికొందరు రాజకీయ పదవుల కోసం నాయకులకు అనుచరులుగా మారుతున్నారు. అదేవిధంగా అధికార పక్షం, ప్రతిపక్షం పార్టీలలో రెండు మూడు గ్రూపులు ఉండటంతో గ్రామాల్లో యువత వారికి పావులుగా మారుతున్నారు.

ఏకగ్రీవానికి విశ్వప్రయత్నాలు

నిజామాబాద్ జిల్లాలోని మోపాల్ మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలో సర్పంచ్, ఉపసర్పంచ్ ఎన్నికను ఏకగ్రీవం చేసేందుకు గ్రామపెద్దలు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం చేయడంతో గ్రామానికి రూ.10 లక్షలు వస్తుందని, దీంతో గ్రామాభివృద్ధిని చేయించుకుకోవచ్చని కులపెద్దలు పోటీల వద్దనే ఇరు పార్టీల నాయకులకు నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఈగ్రామానికి పక్కనే

(తరువాయి 8వ పేజీలో....)

అవగాహనతోనే హెచ్ఐవీ నివారణ

» అదనపు కలెక్టర్ మధుమోహన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుమోహన్

కామారెడ్డి టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే హెచ్ఐవీ నివారించవచ్చని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్‌లో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2030 నాటికి హెచ్ఐవీ కేసులు లేకుండా జిల్లా యంత్రాంగం కృషి చేయాలన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై బహిరంగంగా మాట్లాడితేనే నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. సమాజంలో హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపవద్దని, బాధితులు సక్రమంగా మందులు వాడితే జీవితకాలాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. ఏఆర్‌టీ, ఐసీటీసీ కేంద్రాల వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయడంతోనే రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు లభించిందని తెలిపారు. ఎయిడ్స్ నివారణదినోత్సవంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో

(తరువాయి 8వ పేజీలో.....)

రెండో విడత రెండో రోజు.. 1056 నామినేషన్‌లు

» సర్పంచ్ స్థానాలకు 340
» వార్డు స్థానాలకు 708 నామినేషన్‌లు దాఖాలు
» నేటితో ముగియనున్న రెండో విడత నామినేషన్ల ప్రక్రియ



కామారెడ్డి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి):పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండో విడత నామినేషన్‌ల ప్రక్రియ రెండో రోజు సోమవారం ప్రశాంతంగా కొనసాగింది. జిల్లాలోని ఎల్లారెడ్డి,బాన్సువాడ డివిజన్ పరిధిలోని 7 మండలాల్లో 197 సర్పంచ్,1654 వార్డు స్థానాలకు గాను నామినేషన్ల ప్రక్రియ చేపట్టారు. ఇప్పటికే నిర్ధేశించిన క్లస్టర్‌ల పరిధిలో 57 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. రెండో రోజు ఎల్లారెడ్డి,బాన్సువాడ డివిజన్ పరిధిలో సర్పంచ్,వార్డు స్థానాలకు మొత్తం 1056 నామినేషన్‌లు దాఖాలు అయ్యాయి. ఇందులో సర్పంచ్ స్థానాలకు 340, వార్డు స్థానాలకు 708 నామినేషన్‌లు వచ్చాయి.నేటితో రెండో విడత నామినేషన్ల ప్రక్రియ ముగియనుంది.

రెండవ రోజు వచ్చిన నామినేషన్‌లిలా...

ఎల్లారెడ్డి,బాన్సువాడ డివిజన్‌లోని ఆయా మండలాల్లోని సర్పంచ్ వార్డు స్థానాలకు నామినేషన్ల ప్రక్రియమొదలైంది. రెండో రోజు 197 సర్పంచ్ స్థానాలకు 340 నామినేషన్‌లు దాఖాలు అయ్యాయి. అదేవిధంగా 1654 వార్డు స్థానాలకు గాను 708 నామినేషన్‌లు వచ్చాయి. లింగంపేట మండలంలో 41 సర్పంచ్ స్థానాలకు గాను 65 నామినేషన్‌లు దాఖాలు కాగా, 342 వార్డులకుగాను 110 నామినేషన్‌లు వచ్చాయి. నాగిరెడ్డిపేట 27 సర్పంచ్ స్థానాలకు 44, 232 వార్డుస్థానాలకు 75నామినేషన్‌లు రాగా, గాంధారి 45 సర్పంచ్ స్థానాలకు గాను 71, 366 వార్డులకు 225 నామినేషన్‌లు రాగా, ఎల్లారెడ్డి 31 సర్పంచ్ స్థానాలకు 49, 246 వార్డు స్థానాలకు 78, మహ్మద్‌నగర్ 13 సర్పంచ్ స్థానాలకు 27, 112 వార్డులకు 41, నిజాంసాగర్ 14 సర్పంచ్ స్థానాలకు 38, 122 వార్డులకు 79, పిట్లం 26 సర్పంచ్ స్థానాలకు 46, 234 వార్డులకు 100 నామినేషన్‌లు వచ్చాయి.

శబరిమలకు బస్సు సౌకర్యం | 7లో | డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డిబార్

తండ్రికి కూతురు అంత్యక్రియలు | 8వ పేజీలో..

కామారెడ్డిలో ఆక్రమణల కూల్చివేతలు

» తెల్లవారుజాము నుంచే రంగంలోకి పోలీసులు
» భారీ బందోబస్తు మధ్య భూముల స్వాధీనం

7



సర్వే నెం. 6లో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

పోలీస్ కిష్టయ్య త్యాగాన్ని మరువలేం

» ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి
» జిల్లాలో పలుచోట్ల కిష్టయ్య వర్ధంతి.. ఘన నివాళి

బాన్సువాడ టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోలీస్ కిష్టయ్య చేసిన త్యాగాన్ని మరువలేమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో సోమవారం పోలీసు కిష్టయ్య వర్ధంతి సందర్భంగా ఆయన నాయకులతో కలిసి కిష్టయ్య విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం ఎందరో తమ ప్రాణాలను త్యాగం చేశారని, అందులో పోలీస్ కిష్టయ్య చేసిన త్యాగం అందరినీ కదిలించిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మెన్ పోచారం భాస్కర్‌రెడ్డి, బాన్సువాడ డివిజన్ ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులున్నారు.

కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలి

కామారెడ్డి టౌన్: కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్న అంశాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని రాష్ట్ర ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు పున్న రాజేశ్వర్, జిల్లా అధ్యక్షుడు భిక్షపతి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో పోలీసు కిష్టయ్య వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చిన జీవోను పునరుద్ధరించాలని అన్నారు. మలిదశ ఉద్యమానికి పోలీసు కిష్టయ్య ప్రాణాలు అర్పించి ఊపిరి పోశాడని తెలిపారు. పోలీసు కిష్టయ్య ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూపాల్ గోపాల్, నాగరాజు, సుశీల్, కనకంటి రాజు, రాములు, తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడలో పోలీస్ కిష్టయ్యకు నివాళులర్పిస్తున్న ప్రభుత్వ సలహాదారు పోచారం



కామారెడ్డిలో పోలీసు కిష్టయ్య విగ్రహం వద్ద నివాళ్లు అర్పిస్తున్న ముదిరాజ్ సంఘ నాయకులు



లక్ష్యం చేరేనా.. రుణం అందేనా?

» యాసంగి రుణ లక్ష్యం రూ.1160 కోట్లు
» జిల్లావ్యాప్తంగా 4.04 లక్షల ఎకరాల్లో పంటల సాగు
» బ్యాంకర్లు సకాలంలో స్పందిస్తేనే రైతులకు ప్రయోజనం

7

క్రైం సమాచారం

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

ఇందల్వాయి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లారెడ్డిపల్లికి చెందిన బానావత్ పండరి(50) విద్యుత్ షాక్‌తో సోమవారం మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. పండరి తన పొలం దగ్గర ఇనుప చువ్వలను తీసివేసే క్రమంలో ప్రమాదవశాత్తు 11కేవీ విద్యుత్ వైర్లకు తగిలి ప్రమాదానికి గురయ్యాడు. జిల్లాకేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారన్నారు. మృతుడి భార్య కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య

ఎడపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అశోక్ సాగర్‌లో దూకి మహమ్మద్ యూసుఫ్ (59) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రమ తెలిపారు. బోధన్‌లోని అనీసా నగర్‌కు చెందిన యూసుఫ్ వంట మాస్టారుగా పనిచేసేవాడు. నవంబరు 30న నవీపేటలో ఒక శుభకార్యంలో వంట చేయడానికి వెళ్తున్నానని చెప్పగా.. ఈ వయసులో పని చేసే అవసరం ఏమెచ్చిందని కొడుకులు వారించారు. తనను పని చేసుకోనివ్వడం లేదని భావించి జీవితంపై విరక్తితో యూసుఫ్ అశోక్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జక్రాన్‌పల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు ఎస్సై జి.మహేష్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి ట్రావెల్ బస్సులో 25 మంది ప్రయాణికులను ఎక్కించుకుని సోమవారం అర్ధరాత్రి రాజస్థాన్‌కు వెళ్తుండగా వివేక్‌నగర్‌తండా యూటర్న్ వద్దకు రాగానే ముందుగా ఉన్న ఐచర్‌ను వెనుక నుంచి బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు క్లీనర్ మంగిలాల్, ఐచర్ డ్రైవర్ ఎండీ మస్తాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బస్సులోని 25మంది ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.


కోటగిరిలో కిష్టయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

పోలీసు కిష్టయ్య చిరస్మరణీయుడు

కోటగిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోలీసు కిష్టయ్య చిరస్మరణీయుడని వక్తలు పేర్కొన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడుగా పేరొందిన ఘనత పోలీస్ కిష్టయ్యకే దక్కుతుందని కోటగిరి మండల ముదిరాజ్ సంఘం నాయకులు కొనియాడారు. మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద సోమవారం కానిస్టేబుల్ కిష్టయ్య 16వ వర్ధంతి నిర్వహించారు.కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు సుదర్శన్, నాయకులు కప్ప గణేష్, మహిళ విభాగం అధ్యక్షురాలు స్వరూప, సాయిలు, తదితరులున్నారు.

సాలూరా: మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం సభ్యులు పోలీసు కిష్టయ్య 16వ వర్ధంతిని నిర్వహించారు. జోహార్ కిష్టయ్య అంటూ నినాదాలు చేశారు. తెలంగాణ రాష్ట్రం సాధనలో పోలీస్ కిష్టయ్య ప్రాణాలు వదిలి రాష్ట్ర మలిదశ ఉద్యమానికి ఊపిరి పోశారని కొనియాడారు. పోలీస్ కిష్టయ్య జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లింగయ్య, భూమయ్య, నాగేష్, శంకర్, రమేష్, హన్మాండ్లు, రాజు తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: మండలకేంద్రంలో పోలీసు కిష్టయ్య 16వ వర్ధంతిని ముదిరాజ్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. తెలంగాణ కోసం పోరాడిన వ్యక్తి పోలీసు కృష్ణయ్య అని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రాజేశ్వర్, గంగారం, శ్యామ్, తరుణ్, పాల్గొన్నారు.


వ్యాపారాలు చేయకుండా దుకాణాల ముందు కార్లు నిలిపి ఉంచిన దృశ్యం


కూరగాయల వ్యాపారాలను తరలించాలని రోడ్డుపై బైఠాయించిన దుకాణదారులు, నాయకులు

భీమ్‌గల్‌లో ఉద్రిక్తత

- కూరగాయల మార్కెట్ తరలించాలని అఖిలపక్షం నిరసన
- వ్యతిరేకించిన కూరగాయల వ్యాపారులు

భీమ్‌గల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ మునిసిపల్ కార్యాలయం ముందు కొనసాగుతున్న కూరగాయల మార్కెట్ తొలగింపు ఉద్రిక్తతకు దారి తీసింది. రోడ్డుపై మార్కెట్ కొనసాగించడం వలన రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, తమ దుకాణాల ముందు కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని కొన్ని రోజులుగా అధికారులకు దుకాణాదారులు, వివిధ పార్టీల వారు వినతిపత్రాలు అందించారు. ఈ విషయమై మార్కెట్‌ను నూతనంగా ఏర్పాటు చేసిన స్థలంలో ఏర్పాటు చేసుకోవాలని ఒకరోజు ముందుగానే సర్వ సమాజ్ కమిటీ వారు తెలియజేశారు. ప్రతి సోమవారం నిర్వహించే సంతను దృష్టిలో ఉంచుకొని తమ దుకాణాల ముందు కూరగాయాల మార్కెట్ పెట్టవద్దని తమ కార్లను పార్కింగ్ చేశారు. దీంతో కూరగాయల వ్యాపారుకు, దుకాణదారులకు మధ్య కొంత ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఘటనాస్థలానికి ముందుగానే చేరుకున్న సీఐ సత్యనారాయణ గౌడ్ సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, ఇరువురిని సముదాయించే ప్రయత్నం చేశారు. అధికారులు, పోలీసులు, కూరగాయల వ్యాపారస్థులను నూతన మార్కెట్‌కు తరలించగా కొంతమంది అక్కడ నుంచి కూరగాయల దుకాణాలు తీయకపోవడంతో దుకాణాదారులు, వివిధ పార్టీల నాయకులు, మార్కెట్‌ను తరలించే వరకు జరిగేది లేదని ప్రధాన రోడ్డుపై సాయంత్రం వరకు బైఠాయించారు. ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ట్రైనీ ఐఏఎస్ కరోలిన్ చింగ్తియాన్ మావీ ఘటనాస్థలానికి చేరుకొని మునిసిపల్ అధికారులు, పోలీసులతో చర్చలు జరిపారు. మిగిలిన కూరగాయల వ్యాపారులను కూడా తరలించాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో ఇబ్బందులు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

అనువైన ప్రదేశంలో నిర్వహించాలి


కూరగాయల వ్యాపారులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్

కూరగాయల వ్యాపారులు కొత్త ప్రదేశంలో మార్కెట్ కొనసాగించాలని ట్రైనీ ఐఏఎస్ కరోలిన్ చింగ్తియాన్ మావీ సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగడకుండా నూతనంగా ఏర్పాటు చేసిన మార్కెట్‌కు వెళ్లి అక్కడ కూరగాయల వ్యాపారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కొత్త స్థలంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు లేవని ఆమె దృష్టికి తీసుకురాగా.. వెంటనే పరిష్కరించాలని మునిసిపల్ కమిషనర్ గోపు గంగాధర్, తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్‌ను ట్రైనీ కలెక్టర్ ఆదేశించారు.

నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పరిశీలన

జక్రాన్‌పల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్, మునిపల్లి, పుప్పాలపల్లిలో నామినేషన్‌ల ప్రక్రియను ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా సోమవారం పరిశీలించారు. ఈ గ్రామాల క్లస్టర్ పరిధిలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్‌లు ఎన్ని వచ్చాయని అభ్యర్థులు వేసిన నామినేషన్లను సరిగా ఉన్నాయా లేదా అని నామినేషన్ పత్రాలను పరిశీలించాలని సబ్ కలెక్టర్ అధికారులకు సూచించారు. అనంతరం సబ్ కలెక్టర్ నామినేషన్ ప్రక్రియపై అధికారులకు సూచనలు చేశారు. సబ్ కలెక్టర్ వెంట ఎంపీడీవో సతీష్‌కుమార్, ఆర్.ప్రవీణ్, పంచాయితీ కార్యదర్శులు శ్రీనివాస్, అనిల్, హరీష్ ఉన్నారు.


అర్గుల్‌లో వివరాలు తెలుసుకుంటున్న ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా

అభివృద్ధి కోసమే ఏకగ్రీవం

వర్ని, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసమే ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నట్లు పలువురు పేర్కొన్నారు. ప్రభుత్వ నజరానాతో పనులు చేయొచ్చన్నారు. ఎన్నికల ఖర్చుతో పాటు ఘర్షణలు జరిగే అవకాశం ఉండదన్నారు. ప్రజల మద్దతుతో తాము ఏకగ్రీవమైనట్లు రూప్లానాయక్ తండాకు చెందిన బలరాం, సిద్దాపూర్‌కు చెందిన బాల్‌సింగ్, వకీల్‌ఫారానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డితెలిపారు.


చిరంజీవులును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

విశ్రాంత ఐఏఎస్‌కు పరామర్శ

వేల్పూర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోతె గ్రామానికి చెందిన రిటైర్డ్ ఐఏఎస్ తొగర్ల చిరంజీవులును సోమవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పరామర్శించారు. చిరంజీవులు ఆయన మాతృమూర్తి మల్లుబాయి ఇటీవలే మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి వారింటికి వెళ్లి చిరంజీవులును వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మల్లుబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే మండల కేంద్రంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు గంగాధర్ గౌడ్ అన్న రాజేశ్వర్ గౌడ్ ఇటీవల మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మృతుడి ఇంటికి వెళ్లి గంగాధర్ గౌడ్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రుద్రూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సాయన్న సూచించారు. రుద్రూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబం(ఆర్) గ్రామ శివారులోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో సోమవారం పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో సైబర్ మోసాలు, రోడ్డు భద్రత నియమాలు, మహిళల రక్షణ, మాదక ద్రవ్యాలు, సమాజంలో జరుగుతున్న నేరాలు, చట్టాలపై విద్యార్థులకు నాటికలు, పాటల రూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సాయన్న మాట్లాడుతూ.. విద్యార్థులు సైబర్ మోసాల అవగాహన కలిగి ఉండి, వాటి గురించి తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. యువత మాదక ద్రవ్యాల వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్సై సాయన్న, పోలీసు కళాబృందం



సాలూరలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

హెచ్ఐవీపై అవగాహన అవసరం

సాలూర,డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రజలకు హెచ్ఐవీపై అవగాహన అవసరమని సాలూర మండల మెడికల్ ఆఫీసర్ రాజ్ కుమార్ పేర్కొన్నారు. వ్యాధి ఎలా సంక్రమిస్తుందని, ఎలా అరికట్టవచ్చనేది అందరూ తెలుసుకోవాలన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సాలూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. కండోమ్స్ వాడటం వలన లైంగిక వ్యాధులు సోకవని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ ఇందిరా, సూపర్‌వైజర్ సాయి కుమారి, రోజా, ఏఎన్ఎంలు నర్సమ్మ, గంగామణి, రమణ తదితరులున్నారు.

నవీపేట: మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్(బాలుర)లో హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కావ్య, జన వికాస్ సేవ సంస్థ జిల్లా అధ్యక్షుడు పోశెట్టి, శాస్త్రవేత్త నర్సింహచారి పాల్గొన్నారు.

జీవన్‌రెడ్డికి మతిభ్రమించింది

- కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి

ఆర్మూర్ టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయి మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మతి భ్రమించి మాట్లాడుతున్నాడని, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పనులను ఓర్వలేక నిందలు వేస్తున్నాడని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు. సోమవారం పట్టణంలోని పీవీఆర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నియోజకవర్గంలో ఒక జడ్పీటీసీ, 15 ఎంపీటీసీలు, 6 కౌన్సిలర్లను గెలిపించుకున్నానని, ఈసారిజీవన్‌రెడ్డి గెలిపించుకుంటే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాలు విసిరారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో మొరం దందాలు బీఆర్ఎస్ నాయకులే చేస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో జీవన్‌రెడ్డి బెదిరింపులకు భయపడిన జనం అధికారం రాకుండా చేశారని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి ఆర్మూర్ వరకు మోసం చేసిన చరిత్ర జీవన్ రెడ్డిదన్నారు. మాల్‌లో పెట్టుబడి పెట్టిన వారికి నోటీసులు వస్తున్నాయని ఇలా ఎందరినో మోసం చేశారని ఏర్కొన్నారు. బాధితులు తమ వద్దకు వస్తే సీఎం దగ్గరికి తీసుకెళ్లి న్యాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ మున్నా, కాంగ్రెస్ నాయకులు పండిత్ పవన్, మాజీద్, వాసు, రమణ, శ్రీనివాస్, నారాయణ, విజయ్ అగర్వాల్, భుపేందర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఖర్చు చేయాలి

- డీఎల్‌పీవో నాగరాజు

బోధన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలలో పాల్గొనే సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యులు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఖర్చులు చేయాలని, అధిగమించి ఖర్చులు చేస్తే చర్యలు తీసుకుంటామని బోధన్ డీఎల్‌పీవో నాగరాజు పేర్కొన్నారు. సోమవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 5వేలకు మించి జనాభా ఉన్న గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థులు తమ ఎన్నికల వ్యయాన్ని రూ.2.50లక్షలు, వార్డు సభ్యుడు రూ.50 వేలకు మించకుండా చూసుకోవాలన్నారు. 5వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామమాల్లో సర్పంచ్ అభ్యర్థులు రూ.1.50లక్షలలోపు, వార్డు సభ్యుడు రూ.30వేల రూపాయల వరకు ఖర్చు చేయాలన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తప్పవన్నారు. అభ్యర్థులు ఓటర్లను బెదిరించడం, ప్రత్యర్థులపై దాడులకు పాల్పడొద్దని సూచించారు.

నగేష్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ


కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నగేష్‌రెడ్డిని సన్మానిస్తున్న డొంకేశ్వర్ మండల నాయకులు

రుద్రూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, రుద్రూర్ మాజీ సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్ సోమవారం డీసీసీ అధ్యక్షుడు కాటేపల్లి నగేష్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు కాటేపల్లి నగేష్ రెడ్డి, కాంగ్రెస్ అధ్యక్షుడె బొబ్బిలి రామకృష్ణ, మాజీ డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.

డొంకేశ్వర్: కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా కాటిపల్లి నాగేశ్వర్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన శుభ సందర్భంగా డొంకేశ్వర్ మండల కాంగ్రెస్ మండల నాయకులు జిల్లా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగేశ్‌రెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూమేష్ రెడ్డి, ఉమ్మడి ఎత్తుపోతల కమిటీల మండల చైర్మన్ బోజా రెడ్డి, నాయకులు సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

గ్రామ సంఘాల ఆడిట్

మోర్తాడ్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సోమవారం మహిళా గ్రామసంఘాల అంతర్గత ఆడిట్‌ను నిర్వహించారు. ఆర్థిక లావాదేవీలు, మహిళా సంఘాల పనితీరును అధికారులు పరిశీలించారు. మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం శ్యాం, సీసీలు శ్రీనివాస్, మహేందర్, గాజుల శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.

కల్లు విక్రయాలపై ఎక్సైజ్ శాఖ నిఘా


కల్లు శాంపిల్లను సేకరిస్తున్న దృశ్యం

బోధన్,డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): బోధన్ డివిజన్ అంతటా కల్లు విక్రయ దుకాణాలపై ఎక్సైజ్ శాఖ నిరంతర నిఘా ఉంటుందని ఎక్సైజ్ సీఐ భాస్కర్ రావు అన్నారు. సోమవారం పలు కల్లు దుకాణాలపై దాడులు నిర్వహించి కల్లు శాంపిళ్లను సేకరించారు. నాలుగైదు నెలల వ్యవధిలో వివిధ కల్లు దుకాణాల నుంచి కల్లు శాంపిళ్లు సేకరించి రసాయనాల పరీక్షల నిమిత్తం నిజామాబాద్ ల్యాబ్‌కు పంపుతున్నామన్నారు. కల్లు అక్రమ అమ్మకాలు జరిపితే కేసులు నమోదు చేస్తామని, నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కుక్క దాడిలో గాయాలు

లింగంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో పిచ్చి కుక్క దాడిలో పలువురికి గాయాలయ్యాయి. సోమవారం మండల కేంద్రానికి చెందిన కుమ్మరి సంగవ్వ, స్వామి, సింధుతోపాటు పలువురిని కుక్క కరిచినట్లు గ్రామస్థులు తెలిపారు.అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలన్నారు.

బీమా చెక్కు అందజేత

బోధన్,డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ సిబ్బంది బెల్లాల్ మహేందర్ మే నెలలో మృతి చెందగా మృతుడి భార్య నాగలక్ష్మికి సోమవారం రూ.కోటి ఇన్సూరెన్స్ చెక్కును అందజేసినట్లు బోధన్ విద్యుత్ శాఖ అధికారి ముక్త్యార్ హైమద్ తెలిపారు. విద్యుత్ సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, బ్యాంక్ ఖాతాలలో ఇన్సూరెన్స్ చేసుకోవాలని సూచించారు.

తిమ్మాపూర్‌లో ఉమ్మడి జిల్లా టోర్నీ

మోర్తాడ్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్‌లో లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్‌ను ఈ నెల 10, 11వ తేదీల్లో నిర్వహించనున్నట్లు పీడీ ఇట్టెడి ఆనంద్ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతిగా రూ.5వేలు, ట్రోఫీలు మెమెంటోలు అందజేస్తారని పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనే జట్లు రూ.300 ఎంట్రీ ఫీజుతో 9వ తేదీలోపు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 89856 10844 నంబరులో సంప్రదించాలని కోరారు.


పచ్చలనడ్కుడలో రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు


అంకాపూర్‌లో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి


తొర్లికొండలో మల్లన్న స్వామి షిడిని లాగుతున్న భక్తులు

మల్లన్నకు ప్రణమిల్లే..!

వేల్పూర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామ సమీపంలోని పెద్దవాగు ఒడ్డును కొమిరెల్లి మల్లన్న జాతర రథోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లన్న ఆలయం వద్ద భక్తులు బారులు తీరి నైవేద్యాలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం బద్ది కులానికి చెందిన ఒక వ్యక్తి భయంకరమైన పోతరాజు వేషంతో వచ్చి రథం ముందు వేసిన ముగ్గు పటంలో కూర్చొని మంత్రాలు ఉచ్చరిస్తు మేకపిల్లలను నోటితో గావుపట్టి కొరకడం, రంగురంగుల బంతిపూలతో అందంగా అలంకరించిన రథం (షిడి)నికి ఏర్పాటు చేసిన ఎత్తయిన కర్రకు మధ్యలో ఏర్పాటు చేసిన ఉయ్యాలపై వంశపారంపర్యంగా వస్తున్న అగ్గు కులానికి చెందిన భక్తుడు ఒకరు కూర్చుకున్న అనంతర రథోత్సవం ప్రారంభించారు. విశాలమైన ఆలయం చుట్టూ తాళ్లసహాయంతో లాగుతూ భక్తులు తిప్పడం ఈ జాతరలో సందడి సంతరించుకుంది. గ్రామాభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో జరిగిన ఈ జాతర రథోత్సవానికి వచ్చిన భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ జాతరకు స్థానిక గ్రామస్థులే కాకుండా చుట్టు ప్రక్కల నుంచి వందలాది మంది తరలివచ్చి మల్లన్న స్వామికి నైవేద్యాలు సమర్పించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్సై సంజీవ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, స్థానిక సొసైటీ చైర్మన్ లింబారెడ్డి వేడుకలకు హాజరై మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్మూర్: అంకాపూర్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లన్న స్వామి జాతరను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి ఆలయం చుట్టూ రథాన్ని(షిడిని) ఊరేగించారు. అనంతరం అగ్నిగుండం, జాతర నిర్వహించారు. ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి హాజరై మల్లన్న స్వామికి పూజలు చేశారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండలో సోమవారం కొమరవెల్లి ఆదిమల్లన్న స్వామి జాతర ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. స్వామివారి షిడిని ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు, గ్రామస్థులు ఆలయంలో స్వామివారికి నైవేద్యాలు వేసి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

బోధన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బోధన్‌లోని సోమవారం పట్టణంలోని హనుమాన్ టెకిడి కాలనీలో మాజీ కౌన్సిలర్ రవీందర్ యాదవ్ ఇంట్లో అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. అయ్యప్ప స్వాములు భజనలు చేశారు.

ముప్కాల్: బాల్కొండ మండలం వన్నెల్ (బి) సోమవారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. స్థానిక గురుస్వామి బద్రి ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజలో మాలధారులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప నామస్మరణలతో స్వాములు, భక్తులు పులకించిపోయారు.


బోధన్‌లో అయ్యప్ప పడిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

నేటి నుంచి దత్త జయంతి వేడుకలు

నవీపేట: మండల కేంద్రంలోని లింగమయ్య గుట్ట శివాలయంలో మంగళవారం నుంచి ఈనెల 4వ తేదీ వరకు దత్త జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గణపతి పూజ, పుణ్యహవచనం, యాగశాల ప్రవేశం, మండపారాధన, నవగ్రహ, మృత్యుంజయ హోమం, 108 కలశాలతో శివలింగాభిషేకం, మండపారాధన, ఆవహిత దేవత వంటి పూజలు ఉంటాయన్నారు.

ఇ'స్మార్ట్' ప్రచారం



గ్రామ సంగ్రామం

- వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లే ప్రచార అస్త్రాలు
- కనుమరుగైన కరపత్రాలు, వాల్‌పోస్టర్లు

సుభాష్‌నగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌ఫోన్‌ల రాకతో ఎన్నికల ప్రచారం కొత్తపుంతలు తొక్కింది. గతంలో ఎన్నికలు వచ్చాయంటే కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, వాల్‌పెయింట్స్‌తో ప్రచారం నిర్వహించేవారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను ఇస్తూ, వాల్‌పోస్టర్లను గోడకు అతికించేవారు. ప్రస్తుతం సర్పంచ్ అభ్యర్థులకు సోషల్ మీడియానే ప్రధాన ప్రచార అస్త్రంగా మారింది.

ప్రచారం అంతా సోషల్‌మీడియాలోనే..

పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేంత వరకు సోషల్‌మీడియాలో అరకొరగానే ప్రచారం చేసుకున్న పోటీదారులు నోటిఫికేషన్ రాగానే సోషల్ మీడియాలో విస్తృత ప్రచారాన్ని ప్రారంభించారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో స్టోరీలు పెడుతూ ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. ఇక గ్రామ సభ్యుల ఫోన్ నంబర్లను తెలుసుకుని నిత్యం ప్రచార వీడియోలను ఓటర్ల మొబైల్ ఫోన్‌కు పంపిస్తూ పరోక్షంగా ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేస్తూ..

అంతేకాకుండా తమకు అనుచరులుగా ఉన్న నాయకుల ఫోన్‌లలో స్టేటస్‌లు పెట్టుకుని ప్రచారాలను నిర్వహిస్తున్నారు. పంచాయతీ పరిధిలోని వాట్సాప్ గ్రూప్‌లలో వీడియోలు, ఫొటోలు పంపిస్తూ ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటివరకు గ్రామంలో చేసిన సేవలను, వాటికి సంబంధించిన ఫొటోలను వీడియోలుగా ఎడిట్ చేయించి, పాటలను జోడిస్తూ పంపిస్తున్నారు. కొందరు అభ్యర్థులు ఇప్పటికే తమ పేరుమీద పాటలను కూడా రాయించుకున్నారు. నిత్యం మెసెజ్‌లతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌ల ద్వారా ప్రచారం చేస్తున్నారు. అనుచరులను వాట్సాప్ గ్రూప్‌లో చేర్చి ఎవరు ఏం చేయాలనేది నిర్ణయిస్తున్నారు. పంచాయతీ ఎన్నికలకు సోషల్‌మీడియాను అభ్యర్థులు వినియోగించుకుంటున్నారు.

ఎన్నికల సీజన్‌లో.. కాసుల వర్షం



గ్రామ పంచాయతీల్లో వసూలైన మొండి బకాయిలు

బోధన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లుగా పేరుకుపోయిన మొండి బకాయిలు స్థానిక సంస్థల ఎన్నికల పుణ్యమా అ ని గంపగుత్తగా వసూల య్యాయి. గడిచిన రెండేళ్లుగా నిధులు లేక నిస్తేజంగా ఉన్న గ్రామ పంచాయతీ ఖాతాల్లో సర్పంచ్ ఎన్నికల కారణంగా కాసుల వర్షం కురిసింది. ఎన్నికల నియామవళిలో నామినేషన్ దాఖలు చేసే ప్రతి అభ్యర్థితో పాటుగా తనను ప్రతిపాదించే వ్యక్తులు కూడా గ్రామ పంచాయితీకి ఎలాంటి బకాయిలు ఉండకూడదు. ఇంటి పన్ను, నల్లా పన్నులాంటివి ఏవైనా కూడా పూర్తిగా చెల్లిస్తేనే సంబంధిత గ్రామ పంచా యతీ కార్యదర్శి నో డ్యూ సర్టిఫికెట్ అందజేస్తారు. దీంతో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, అభ్యర్థులతో పాటుగా ప్రతిపాదకులకు సంబంధించిన బకాయిలు మొత్తం చెల్లించేందుకు పంచాయతీల ఎదుట క్యూ కడుతుండటం గమనార్హం. పన్నుబకాయిలుచెల్లించడంతో గ్రామ కార్యదర్శి నో డ్యూ సర్టిఫికెట్లు చెల్లించిన వారికే మాత్రమే అందజేస్తున్నారు. దీంతో ఇన్నాళ్లు సిబ్బంది జీతాలకు డబ్బులు లేక వెలవెలబోయిన గ్రామ ఖాతాలు కాసులవర్షంతో కళకళలాడుతున్నాయి.

బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన వారితో డీసీసీబీ మాజీ చైర్మన్ భాస్కర్ రెడ్డి

బాన్సువాడటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ పార్టీ మార్పులు జోరుగా సాగుతున్నాయి. డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బాన్సువాడ నియోజకవర్గంలోని వర్ని మండలం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో ముప్పిగొల్ల పల్లవీ మోహన్, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



భైరాపూర్‌లో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్సై మహేందర్

బీర్కూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా ప్రజలు సహకరించాలని ఎస్సై మహేందర్ సూచించారు. సోమవారం బీర్కూర్ మండలం భైరాపూర్ గ్రామస్థులతో ఎస్సై సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో గ్రామ యువత, ప్రజలు శాంతియుతంగా పాల్గొనాలన్నారు. ఎలాంటి గొడవలకు తావు లేకుండా ఎన్నికలు నిర్వహించుకోవాలన్నారు. గొడవలు పడి కేసుల పాలై కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి తెచ్చుకోవద్దని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసుశాఖ పకడ్బందీగా ఏర్పాట్లు చేసిందన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి

బాన్సువాడ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలను త్యాగం చేసిన మొదటి అమరుడు శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా ఈ నెల 3న తలపెట్టిన చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని మలిదశ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఉడుత గంగాధర్ పిలుపునిచ్చారు. సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని శ్రీకాంతాచారి విగ్రహానికి నివాళులు అర్పించనున్నామన్నారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీల కొరకు ఒత్తిడి తెచ్చేందుకు సభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సభకు ప్రొ.కోదండరాం హాజరవుతారని, ఉద్యమకారులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో బాన్సువాడ మండల అధ్యక్షుడు చందు గంజివార్, నాయకులు, తదితరులు ఉన్నారు.

ఎన్నికల నిర్వహణపై పీవోలకు శిక్షణ



బీర్కూర్‌లో పీవోలకు శిక్షణ ఇస్తున్న ఎంపీడీవో శ్రీనిధి

బీర్కూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఎంపీడీవో శ్రీనిధి ప్రిసైడింగ్ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఎలాంటి తప్పులు లేకుండా, పక్షపాతరహితంగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఎన్నికలకు ముందు రోజు డీఆర్సీలో ఎన్నికల సామగ్రిని క్షుణ్ణంగా తనిఖీ చేసుకొని ఆరోజు కేటాయించిన వాహనాలలో పోలింగ్ బూత్‌లకి చేరుకోవాలన్నారు. పోలింగ్ రోజు ఉదయం 6 గంటలకు పోలింగ్ బాక్స్‌లని సిద్ధం చేసుకుని సీల్ వేసి ఏజెంట్ సమక్షంలో పోలింగ్ ప్రారంభించాలని తెలిపారు. పోలింగ్ సమయం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగుతుందన్నారు. ఛాలెంజ్, టెండర్ ఓట్లు రాకుండా చూడాలని ప్రతీ ఓటర్‌కి పోలింగ్ స్లిప్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డుని తనిఖీ చేయాలన్నారు. ఒంటి గంట సమయంలో క్యూ లైన్‌లో ఉన్న వారికి కూడా టోకెన్‌లు ఇచ్చి ఓటు వేసేలా చూడాలని తెలిపారు. అదే రోజు 2 గంటలకు స్టేజి-2 ఆఫీసర్ కౌంటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ప్రధానంగా పీవో డిక్లరేషన్, పీవో డైరీ, బ్యాలెట్ పేపర్ అకౌంట్, పేపర్ సీల్ అకౌంట్, సందర్శన పత్రం వంటివి పూరించాలన్నారు. అలాగే ఎన్నికల ఫార్మ్‌ను సీల్డ్ కవర్లు, సీల్డ్ వేయని కవర్స్‌ను ఎలా పూరించాలో తెలిపారు. ఎంపీవో మహబూబ్, సూపరింటెండెంట్ భానుప్రకాష్, ఎంఈవో వెంకన్న, ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

శబరిమల వెళ్లే భక్తులకు బస్సు సౌకర్యం

బాన్సువాడ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శబరిమల వెళ్లే భక్తులకు టీజీఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తుందని బాన్సువాడ ఆర్టీసీ డిపో మేనేజర్ రవికుమార్ తెలిపారు. సోమవారం ఆయన పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో దీక్షా స్వాములను కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతేడాది బస్సు చార్జీ కిలోమీటరుకు రూ.65 ఉండగా ప్రస్తుతం రూ.59 మాత్రమే ఉందన్నారు. సూపర్ లగ్జరీ (నాన్ ఏసీ) 36 కెపాసిటీతో కి.మీకు రూ.59, రాజధాని (ఏసీ) 40 కెపాసిటీతో కి.మీకు రూ.77, డీలక్స్ బస్సు (నాన్ ఏసీ) 40 మంది కెపాసిటితో కి.మీకు రూ.57గా ఉందన్నారు. అదేవిధంగా ప్రతీ గంటకు రూ.300 వెయిటింగ్ చార్జీ ఉంటుందని వివరించారు. అయ్యప్ప దీక్షా స్వాములు, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 9959226020 నంబరును సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దీక్షా స్వాములు, ఆర్టీసీ అధికారులు తదితరులు ఉన్నారు.

కామారెడ్డిలో ఆక్రమణల కూల్చివేతలు

- తెల్లవారుజామున నుంచే కూల్చివేత చర్యలు
- పోలీసుల భారీ బందోబస్తు

కామారెడ్డిటౌన్, డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వీక్లీమార్కెట్ సమీపంలో ఏళ్ల నుంచి వివాదాల్లో ఉన్న సర్వే నంబర్-6లో ఆక్రమణలకు గురైన భూములకు సోమవారం మున్సిపల్, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ భూముల్లో కొందరు ఆక్రమణలు చేపట్టి ఇతర అవసరాల కోసం వాడుకుంటున్నారని, మరికొందరు రిజిస్ట్రేషన్‌లు సైతం చేసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గత వారం రోజుల క్రితం మున్సిపల్ అధికారులు ఆ ప్రాంతంలో ఉన్నవారికి నోటీసులు జారీచేశారు. దీంతో కొందరు ఈ అంశంపై కోర్టుకు వెళ్లారు. మరి కొందరు ఎలాంటి సమాధానం ఇవ్వకపోవడంతో మున్సిపల్, రెవెన్యూ అధికారులు సోమవారం తెల్లవారుజామున పోలీసుల భారీ బందోబస్తు మధ్య ఆక్రమణలను తొలగించారు. దీంతో స్థానికంగా ఉన్నవారు అధికారుల కూల్చివేతలను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించి కూల్చివేతలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశారు. కాగా ఈ స్థలంలో ప్రతి ఆదివారం సుభాష్‌రోడ్డు ప్రాంతాల్లో రోడ్లపై కూరగాయాలు అమ్మకాలు జరుపుతున్నవారిని ఇక్కడ అమ్మకాలు జరిపేలా చూడనున్నట్లు సమాచారం. అయితే తాము ఏళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నామని కొందరు, ఇతరుల దగ్గర కొనుగోలు చేశామని మరికొందరు పేర్కొన్నారు. కోర్టు నుంచి స్టే ఆర్డర్‌లు ఉన్నప్పటికీ అధికారులు కూల్చివేతలకు దిగడం సరికాదని అన్నారు. ప్రభుత్వ భూములైతే అధికారులు ఎందుకు ఇంటిపన్నును వసూలు చేశారని, ఏ విధంగా రిజిస్ట్రేషన్‌లు చేశారని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములల్లో ఆక్రమణలు చేసిన వారికి ఇదివరకే నోటీసులు అందించామని, అయినా వారి నుంచి ఎలాంటి సమాధానం లేకపోవడంతో ఆక్రమణల తొలగింపులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, టీపీవో గిరిధర్, తహసీల్దార్ జనార్ధన్, పట్టణ సీఐ నరహరి, మున్సిపల్, రెవెన్యూ, పోలీసుశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోలీసుల భారీ బందోబస్తు



కూల్చివేసిన ఆక్రమణలు

లక్ష్యం చేరేనా.. రుణం అందేనా..?

- యాసంగి రుణ లక్ష్యం రూ.1160కోట్లు
- జిల్లాలో యాసంగి పంటల సాగు 4.04 లక్షల ఎకరాలు
- సకాలంలో రుణాలు అందిస్తేనే రైతులకు ప్రయోజనం
- గడిచిన వానాకాలంలో లక్ష్యం చేరని పంట రుణాలు
- రూ.1700ల కోట్లకు రూ.1200ల కోట్లు అందజేత



కామారెడ్డి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): కామారెడ్డి జిల్లాలో యాసంగి సీజన్‌లోనైనా ఆయా బ్యాంకర్లకు నిర్దేశించిన పంట రుణాలను లక్ష్యాలకు అనుగుణంగా ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన యాసంగి పంటరుణాల లక్ష్యం రూ.1160 కోట్లుగా జిల్లా అధికార యంత్రాంగం నిర్దేశించింది. లక్ష్యానికి అనుగుణంగా బ్యాంకర్లు రుణాలు అందిస్తారో లేదో చూడాలి. గత వానాకాలం సీజన్‌లో రైతులకు పూర్తి స్థాయిలో పంట రుణాలు ఇవ్వలేదు. వానకాలంలో రూ.1741కోట్ల పంట రుణాలు ఆయా బ్యాంకర్లు ఇవాల్సి ఉండగా రూ.1272 కోట్లు 94557 మంది రైతులకు పంట రుణాలను అందజేశారు. దీంతో ఆ సీజన్‌లో రుణాల లక్ష్యం పూర్తిచేయలేదు. ఈ యాసంగిలోనైన లక్ష్యాలకు తగ్గట్టుగా రుణాలు ఇవ్వాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉంది.

4.04 లక్షల ఎకరాల సాగు..

ఈ యాసంగి సీజన్‌లో జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ల పరిధిలో మొత్తం 4,04,575 ఎకరాల్లో వివిధ పంటలు సాగు అయ్యే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ శాఖ నిర్దేశించింది. ఇందులో వరి 2,46,500 ఎకరాల్లో, మొక్కజొన్న 34,420, శనగ 38,500, జొన్న 72,200, పొద్దుతిరుగుడు 2,550 , గోధుమలు 720, పెసర్లు 25, మినుములు 2,550, తెల్ల కుసుమలు 880, నల్లకుసుమలు 1692, ఇతర పంటలు 8వేలఎకరాల్లో సాగు కానున్నాయి.

రుణ లక్ష్యం నెరవేరితేనే ప్రయోజనం

2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి యాసంగి రుణ లక్ష్యాన్ని అధికారులు నిర్ణయించారు. సన్న, చిన్నకారు రైతులు ఎక్కువగా ఉన్నందున వీరికి పంట పెట్టుబడులకు బ్యాంకర్లు సకాలంలో రుణాలు అందిస్తేనే ప్రయోజనం చేకురుతుంది. రైతు భరోసా, పీఎం కిసాన్ లాంటి పథకాలు ఉనప్పటికీ అవి పంట పెట్టుబడులను పూర్తిగా తీర్చడం లేదు. దీంతో సన్న, చిన్న కారు రైతులు పంట రుణాల పైనే ఆధారపడుతున్నారు. ఇదిలా ఉంటే యాసంగి సీజన్‌కు ఇంకా రైతుభరోసా అందలేదు. యాసంగి ఇప్పటికే ప్రారంభమైంది. చాలా చోట్ల భూమిని సాగుకు సిద్ధం చేశారు. పలుచోట్ల నారుమళ్లు సైతం వేస్తున్నారు. ఈ సమయంలో పంట పెట్టుబడులకు రైతుకు నగదు అవసరమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో బ్యాంకర్లు సకాలంలో రుణాలు అందిస్తేనే ప్రయోజనం కలుగుతుంది.

అర్హులందరికీ రుణాలు ఇస్తాం

పంట పెట్టుబడుల్లో భాగంగా రుణాలకు దరఖాస్తు చేసుకునే అర్హులైన రైతులందరికీ పంట రుణాలను అందిస్తాం. రుణాలు పొందాలనుకున్న అన్నదాతలు తప్పక రిన్యూవల్ చేసుకోవాలి. అయితేనే రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. యాసంగి సీజన్ లక్ష్యం మేరకు రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటాం.

- చంద్రశేఖర్,
లీడ్ బ్యాంకు మేనేజరు, కామారెడ్డి

మూడో విడత ఎన్నికలకు ముమ్మర ఏర్పాట్లు

మద్నూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండలంలో డిసెంబరు 17న నిర్వహించనున్న 3వ విడత పంచాయతీ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈ నెల 3 నుంచి నామినేషన్ల స్వీకరణ ఉండటంతో అధికారులు క్లస్టర్ గ్రామలను ఏర్పాటుచేశారు. రిటర్నింగ్, సహాయరిటర్నింగ్ అధికారులను నియమించి ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు శిక్షణ ఇచ్చారు. ఇక ఉమ్మడి మద్నూర్ మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో ఎనిమిది క్లస్టర్ గ్రామాలుగా హండేకేలూర్, కొడ్చిర, మద్నూర్, మేనూర్, పెద్ద ఎక్లారా, సుల్తాన్‌పేట్, పెద్ద తడుగూర్ ఏర్పాటుచేశారు. డోంగ్లి మండలంలో 13 పంచాయతీల్లో క్లస్టర్లుగా దోతి, కుర్లా, డోంగ్లి, పెద్దటాక్లీలలో ఏర్పాటుచేశారు.

నాగిరెడ్డిపేటలో 44 నామినేషన్లు దాఖలు

నాగిరెడ్డిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట మండలంలోని 27 గ్రామ పంచాయితీలకు గాను నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. కాగా సోమవారం 2వ రోజు సర్పంచ్ స్థానాలకు 44 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో లలిత కుమారి తెలిపారు. అలాగే వివిధ గ్రామ పంచాయతీల్లోని వార్డులకు 75 మంది అభ్యర్థులు వార్డు సభ్యులుగా నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆమె వివరించారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి



అధికారులకు శిక్షణ ఇస్తున్న ఎంపీడీవో రాణి

మద్నూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించాలని మద్నూర్ ఎంపీడీవో రాణి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదిక కార్యాలయంలో సోమవారం గ్రామ పంచాయతీ ఎన్నికలు, 2025లో భాగంగా (మద్నూర్ డోంగ్లి) ఉమ్మడి మండలంలో ఎన్నికల విధులు నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో డిసెంబర్ 17న నిర్వహించే మూడో విడత ఎన్నికలను సజావుగా నిర్వహించాలని, 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ల ప్రక్రియ నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి తప్పులకు తావులేకుండా సక్రమంగా పూర్తయ్యేలా చూడాలని పేర్కొన్నారు. తహసీల్దార్ ముజీబ్, ఎంపీవో వెంకట్ నరసయ్య, డోంగ్లి ఎంపీడీవో జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి షబ్బీర్ అలీ ఆర్థికసాయం

నిజామాబాద్ సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని 25వ వార్డుకు చెందిన కోటగల్లి నివాసి జుహీదాబేగం ఇల్లు ఇటీవల అగ్నిప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఇంట్లో సామాగ్రి అంతా కాలిపోయింది. దీంతో ఆమె కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ సోమవారం బాధిత కుటుంబాన్ని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌తో కలిసి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ధీమా వ్యక్తంచేశారు. తక్షణసాయం కింద రూ.50 వేల సొంత డబ్బు అందించారు. త్వరలోనే ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.



బాధితురాలికి ఆర్థిక సహాయం చేస్తున్న షబ్బీర్ అలీ

కేజీకేఎస్ మహాసభలు విజయవంతం

నిజామాబాద్ రూరల్, డిసెంబర్ 01 (ఆంధ్రజ్యోతి): కల్లుగీతకార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలు విజయంతం చేసినందుకు కల్లుగీత కార్మికులకు సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారుడు పెద్ది వెంకటరాములు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... గత నెలలో సూర్యాపేటలో నిర్వహించిన రాష్ట్ర మహాసభలకు పెద్ద ఎత్తున జిల్లా నుంచి కార్మికులు హాజరుకావడం అభినందనీయమన్నారు. గీతవృత్తి రక్షణ, వారి సంక్షేమం, సమస్యలపై సమగ్రంగా చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాకార్యదర్శి శేఖర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు సాయగౌడ్ పాల్గొన్నారు.



రాజీనామా పత్రాన్ని కార్యదర్శికి అందిస్తున్న డైరెక్టర్

సింగిల్ విండో డైరెక్టర్ పదవులకు రాజీనామా

మద్నూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఏ ఇతర సంస్థల్లో ఎన్నికై ఉండకూడదనే ప్రభుత్వ నిబంధన మేరకు సింగిల్ విండో డైరెక్టర్ పదవులకు పలువురు నాయకులు రాజీనామా చేస్తున్నారు. కాగా మద్నూర్ మండలంలోని సింగిల్ విండో పెద్ద తడుగూర్ డైరెక్టర్‌గా ఉన్న కొండ అంజవ్వ, గోజేగావ్ డైరెక్టర్‌గా ఉన్న శివాజీ తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను సింగిల్ విండో కార్యదర్శి గంగాధర్‌కు అందజేశారు. పెద్ద తడుగూర్‌లో మహిళ రిజర్వేషన్ రావడంతో పోటీకి సిద్ధమైనట్లు తెలిపారు. అదేవిధంగా గోజెగావ్ గ్రామానికి అన్‌రిజర్వు సర్పంచ్ స్థానానికి పోటీ చేయనున్న దృష్ట్యా రాజీనామా చేస్తున్నట్లు మాజీ మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ శివాజీ ప్రకటించారు.

క్యాంపస్ ముచ్చట్లు

టీయూలో హెచ్ఐవీ డే

ఇందూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌తో జీవిస్తున్న వ్యక్తుల పట్ల కరుణ, సానుభూతిని చూపాలని ప్రభుత్వ వైద్యకళాశాల ఫోరెన్సిక్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం హెడ్ డాక్టర్ నాగమోహన్‌రావు అన్నారు. డిచ్‌పల్లిలోని తెలంగాణ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ హెచ్ఐవీ డే నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ నాగమోహన్ రావు హాజరై మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా హెచ్ఐవీపై అవగాహన పెంచడం కోసం ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ అబ్దుల్ అలీఖాన్, యూనివర్సిటీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డిబార్

ఇందూరు: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ పరీక్షల్లో ఇద్దరిని డిబార్ చేసినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య గంటా చంద్రశేఖర్ తెలిపారు. 9వ రోజు జరిగిన డిగ్రీ పరీక్షల్లో ఉదయం జరిగిన పరీక్షకు 2475 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా 2263 మంది హాజరయ్యారు. 210 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 6053 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా 5746 మంది హాజరయ్యారు. 307 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఆర్మూర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్‌లో ఇద్దరిని డిబార్ చేసినట్లు ఆయన వివరించారు.

11 నుంచి 18 వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు

తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ ప్రాక్టికల్ పరీక్షలు డిసెంబర్ 11 నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు టీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య సంపత్‌కుమార్ తెలిపారు. 1వ, 3వ, 5వ రెగ్యూలర్ ప్రాక్టికల్ పరీక్షలు, ఇంటర్నల్స్, 2వ,4వ,6వ బ్యాక్‌లాగ్ ప్రాక్టికల్స్ ప్రాజెక్ట్ వైవాస్, 4వ బ్యాక్‌లాగ్స్ ఉంటాయని పరీక్షల నియంత్రణ అధికారి తెలిపారు. వివరాలకు టీయూ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

జీజీ కళాశాలలో డిగ్రీ పరీక్షలు ప్రశాంతం

ఇందూరు: జీజీ కళాశాలలో డిగ్రీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొదటి సంవత్సరం రెగ్యూలర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు సోమవారం జరిగాయి. మొత్తం 664 మంది విద్యార్థులకు 1607 మంది హాజరుకాగా 57 మంది హాజరైనట్లు కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ రంగరత్నం, పరీక్షల నియంత్రణ అధికారి భరత్‌రాజ్, అకడమిక్ కోఆర్డినేటర్ నహిదా బేగం తెలిపారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు



పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

భిక్కనూరు, డిసెంబరు 1: భిక్కనూరు మండలంలోని అంతంపల్లి గ్రామానికి చెందిన సింగిల్ విండో డైరెక్టర్ స్వరూప సిద్దరాములు, పోచయ్య, సురేష్‌గుప్తా, లింబారెడ్డి, రాజిరెడ్డితో పాటుగా పలువురు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ మేరకు వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు రోజులు దగ్గరపడ్డాయని, సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అడ్రస్ లేకుండా చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ పట్ల వ్యతిరేకత ఎక్కువైందని, కాంగ్రెస్ పార్టీకి చాలామంది రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మధుమోహన్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో బాజిరెడ్డి గోవర్ధన్ సమక్షంలో..

బాన్సువాడ రూరల్: మండలంలోని హన్మాజీపేట్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు వడ్ల కృష్ణమూర్తి, సంజీవులు, వడ్ల సంగయ్య, సింగం సాయిలు, భాస్కర్ సోమవారం మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు విఠల్, రాజు, సాయిలు, శంకర్, మంద సాయిలు, తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడ మండలకేంద్రంలో..

నిజాంసాగర్‌లో హన్మంత్ షిండే ఆధ్వర్యంలో..

నిజాంసాగర్, డిసెంబరు 1: మండలంలోని నర్సింగరావుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు 50 మంది సోమవారం మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు విఠల్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ మోహన్‌రెడ్డి, సీడీసీ మాజీఅధ్యక్షుడు దుర్గారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నిజాంసాగర్ మండలకేంద్రంలో..

శబరిమలైకి తరలిన అయ్యప్ప స్వాములు



శబరిమలైకి తరలివెళ్తున్న అయ్యప్పస్వాములు

భిక్కనూరు, డిసెంబరు 1: ఎంతో భక్తిశ్రద్ధలతో కఠినమైన 41రోజుల అయ్యప్ప దీక్షను పూర్తి చేసుకుని, తలపై ఇరుముడి ధరించి భిక్కనూరు మండలకేంద్రానికి చెందిన అయ్యప్పస్వాములు శబరిమలైకి ప్రత్యేక వాహనాల్లో సోమవారం తరలివెళ్లారు. అంతకుముందు హరిహరపుత్ర అయ్యప్ప ఆలయంలో, సిద్ధరామేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. గురుస్వామి సుబ్బారావు, శ్రీనివాస్‌రెడ్డి, బాలప్రకాష్, ఉన్నారు.

గురుకుల పాఠశాలలో వైద్యశిబిరం



పాఠశాలలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

భిక్కనూరు, డిసెంబరు 1: మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామ శివారులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్యురాలు దివ్య వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. అనంతరం హాస్టల్‌లోని వంటగదిని తనిఖీ చేసి భోజనాన్ని పరిశీలించారు. హెచ్ఈవో వెంకటరమణ, ప్రిన్సిపాల్ రఘు, వైస్ ప్రిన్సిపాల్ కిషన్, హెల్త్ సూపర్‌వైజర్ రాజు, ఏఎన్ఎం యాదమ్మ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంవీఐ స్నిగ్ధ

గాంధారి, డిసెంబరు 1: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ప్రిన్సిపాల్ శిల్ప అధ్యక్షతన విద్యార్థులకు రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల నిర్మూలనపై సోమవారం అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైనా ఏఎంవీఐ స్నిగ్ధ, మధుకర్, శ్రావణ్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని, కళాశాల రోడ్డు పక్కనే ఉన్నందున మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. రోడ్డుప్రమాదంలో గోల్డెన్ అవర్ ప్రాముఖ్యత, ప్రథమ చికిత్స, హెల్మెట్ ప్రాముఖ్యాన్ని వివరించారు.

వేడెక్కుతున్న.. పల్లె రాజకీయం

(5వ పేజీ తరువాయి...)

ఉన్న కాస్పాగ్ తండా కులపెద్దలు కూడా ఏకగ్రీవ ప్రయత్నంలో ఉన్నారు. మిగతా గ్రామాల్లో పోటీకి తీవ్రతరం అవుతున్నారు. మండలంలో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండటంతో ఇరుపార్టీల నాయకులు వారిపై ఆశలు పెట్టుకుంటున్నారు. ప్రధాన పార్టీల నాయకులు రహస్య సమావేశాలు ఏర్పాటుచేస్తూ మద్దతు తమకే ఇవ్వాలని కులసంఘాలతో చర్చలు జరుపుతున్నారు. మందు విందులతో స్వాగతిస్తున్నారు.

రాజకీయాలతో గ్రామాల్లో చిచ్చు

గ్రామాల్లో అందరూ కుటుంబ సభ్యుల్లా ఉండేవాళ్లం. ప్రస్తుతం కుటుంబాల్లో సైతం రాజకీయం మొదలై అనుబంధాలు కనుమరుగయ్యాయి. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా యువత ముందుకెళ్లాలి. నాయకుల ప్రలోభాలకు లొంగకుండా అనుకున్నది సాధించాలి.

- మోహన్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్

ఘనంగా గీతాజయంతి వేడుకలు

సదాశివనగర్, డిసెంబరు 1: మండలంలోని లింగంపల్లి శ్రీ కృష్ణమందిరంలో గీతా జయంతి వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. 2 రోజులు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు స్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో స్వామి ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేసి గ్రామవీధుల్లో భక్తిపాటలతో ఊరేగింపు నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున స్వామి ఉత్సవ మూర్తులకు మంగళస్నానాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 8 గంటలకు ధ్వజారోహణం చేసి భక్తులకు ఆలయ పీఠాధిపతి శ్రీ మచాలే బాబా ఆధ్వర్యంలో గీతా ప్రవచనాలు చేశారు. ప్రముఖ వక్త డా. రాంసింగ్ భగవద్గీత పఠనం, అందులోని గీతా సారాంశాన్ని భక్తులకు వివరించారు. అనంతరం గ్రామస్థుల సమక్షంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.



లింగంపల్లిలో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



కామారెడ్డి జిల్లాకేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్‌లో గీతాజయంతి వేడుకలు

బాన్సువాడటౌన్: పట్టణంలో సోమవారం ఉడుగుల ఈశ్వరయ్య కుటుంబం, అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో గీతా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అయ్యప్ప ఆలయం నుంచి దీక్షా స్వాములు, భక్తులు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పెద్ద హనుమాన్ మందిరం, శ్రీ కృష్ణ మందిరం, శ్రీ వెంకటేశ్వర మందిరం, బ్రహ్మం గారి ఆలయం, ప్రధాన రహదారి గుండా సాగుతూ చైతన్యకాలనీలోని దత్తమందిరం వరకు ర్యాలీ సాగింది. అక్కడ భగవద్గీత పుస్తకానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్లోకాలను పఠించారు. అనంతరం దీక్షా స్వాములకు, భక్తులకు పండ్లు, పాలు అందజేశారు. కార్యక్రమంలో ఉడుగుల ఈశ్వరయ్య కుటుంబ సభ్యులు సంజీవ్‌కుమార్, విజయలక్ష్మీ, శ్రీనివాస్, స్వాతి, నాగరాజు, స్వప్న, శకుంతల, అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు అర్షపల్లి సాయిరెడ్డి, గురుస్వాములు తాటి ప్రశాంత్, చిదుర సుధాకర్, సచిన్, అరవింద్, పవిత్ర, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిటౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్‌లో సోమవారం గీతాజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు భగవద్గీత శ్లోకాలు ఆలపించారు. భగవద్గీత ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం, అకాడమిక్ ప్రిన్సి పాల్ నాగేష్, తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడలో గీతాజయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



బ్యాంకు ప్రారంభిస్తున్న దృశ్యం

కరూర్ వైశ్య బ్యాంకు ప్రారంభం

కామారెడ్డి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరూర్ వైశ్య బ్యాంకు ప్రజలకు, వ్యాపారులకు ఎంతో సౌకర్యార్థంగా నిలుస్తుందని జిల్లా రైస్‌మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు పప్పుల రాజేంద్రప్రసాద్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కరూర్ వైశ్య బ్యాంకు నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో బ్యాంకు ఏర్పడిన తర్వాత బ్యాంకు లావాదేవీలు, డిపాజిట్లు పెరిగాయని, వ్యాపార వాణిజ్య కార్యకలాపాల నిర్వహణ పెరిగిందన్నారు. ప్రజల సౌకర్యార్థం జాతీయ బ్యాంకులు బ్యాంకింగ్ సేవలను ప్రజల ముందుకు తీసుకువచ్చేందుకు ప్రయత్నించడం అభినందనీయమని తెలిపారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించి మరింత పేరు తెచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రవీందర్, గౌరీశెట్టి లక్ష్మీరాజం, సంతోష్, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శిగా వెంకట్‌గౌడ్

కామారెడ్డిటౌన్: కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్రకార్యదర్శిగా వెంకట్‌గౌడ్ నియామకం అయ్యారు. అదేవిధంగా రాష్ట్రకమిటీలో శంకర్‌గౌడ్, రాజాగౌడ్‌లను తీసుకున్నారు. ఈ సందర్భంగా వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ.. జిల్లాలో కల్లు గీత వృత్తిరక్షణ కోసం గీత కార్మికులను ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఫిబ్రవరిలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరీక్షలు

కామారెడ్డి టౌన్: బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను ఫిబ్రవరిలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 7 నుంచి 12 వరకు, 3వసెమిస్టర్ పరీక్షలు 13 నుంచి 20 వరకు, 1వ సెమిస్టర్ పరీక్షలు 22 నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్ష ఫీజులను డిసెంబరు 20వ తేదీలోగా చెల్లించాలని సూచించారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మునిసిపాలిటీ పరిధిలోని 3వ వార్డుకు చెందిన 15 మంది యువకులు సోమవారం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి పనులు, పార్టీ కార్యకలపాలపై ఆకర్షితులై యువకులు పార్టీలో చేరడం అభినందించదగిన విషయమని అన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో అమన్‌సైప్, హాజీ ఆదిల్, గౌస్, ఇర్ఫాన్, ఇష్తాకర్, మసూద్, నజీద్, తదితరులు ఉన్నారు. బీఆర్ఎస్ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు భానుప్రసాద్, ఉపాధ్యక్షుడు సాయి తదితరులు ఉన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత

కామారెడ్డి టౌన్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో సోమవారం జిల్లా గ్రంథాలయానికి కవులు తమ రచనలకు సంబంధించిన పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రచయితల వేదిక కవులు రచించిన రచనలు చదివే అవకాశాన్ని పాఠకులకు అందించడం సంతోషకరమని తెలిపారు. కార్యక్రమంలో తెరవే జిల్లా బాధ్యులు గంగాప్రసాద్, పీతాంబర్, నాగభూషణం, కాశ నర్సయ్య పాల్గొన్నారు.

మహమ్మద్‌నగర్‌లో భారీగా నామినేషన్లు

మహమ్మద్‌నగర్: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మండలంలో సర్పంచ్, వార్డు స్థానాలకు అభ్యర్థుల నామినేషన్లు ఊపందుకున్నాయి. ఉదయం నుంచే మండలంలోని 13 గ్రామపంచాయతీలకు సంబంధించి అభ్యర్థులు తమ అనుచరులతో కలిసి నామినేషన్ కేంద్రాల వద్ద క్యూకడుతున్నారు. నామినేషన్లు వేసిన అభ్యర్థులు గ్రామాల్లో ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

తాడ్వాయి: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తాడ్వాయి ఎస్సై నరేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పోలీస్ కళా బృంద సభ్యులు నిర్వహించిన ఎన్నికల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగి పోవద్దని అన్నారు. పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని గొడవలు చేసుకోవద్దని, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని సూచించారు. డబ్బుకు, మద్యానికి లొంగవద్దని, విలువైన ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణ, సెల్ ఫోన్స్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియాలతో జాగ్రత్తగా ఉండాలని పోలీస్ కళాబృందం వారు తెలిపారు. రామచందర్, తిరుపతి, శేషారావు, ప్రభాకర్, సాయిలు, ఉపాధ్యాయులున్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

పాల్వంచ: మండలంలోని పోతారం గ్రామంలో అప్పుల బాధతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న కోకట్ల చిన్నమల్లయ్య కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయాన్ని అందించారు. ఆయన వెంట జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, పాల్వంచ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంబోతుల రాజాగౌడ్, పైడాకుల రాములు, సూర రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడి కుటుంబానికి..

కామారెడ్డి రూరల్: సదాశివనగర్ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామోదర్‌రెడ్డి పార్థివదేహానికి సోమవారం కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో ఆయన మాట్లాడారు. 2 రోజుల క్రితం పాఠశాల విద్యార్థులతో విహారయాత్రకు వెళ్లిన ఆయన గుండెపోటుతో భద్రాచలంలో మృతి చెందినట్లు తెలిపారు. దామోదర్ రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట ఉపాధ్యాయులు, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శిగా సురేష్

కామారెడ్డి టౌన్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా ప్రధానకార్యదర్శిగా సురేష్ నియామకం అయ్యారు. గత నెల 28న నిర్వహించిన జిల్లా మహాసభల్లో చర్చించి సురేష్‌కు జిల్లా ప్రధానకార్యదర్శిగా రాష్ట్రబాధ్యులు నియమించారు. తనపై నమ్మకంతో ప్రధానకార్యదర్శిగా అవకాశం కల్పించిన రాష్ట్రబాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరా టం కొనసాగిస్తానని తెలిపారు.

పీఓలకు ఎన్నికలపై శిక్షణ తరగతులు

కామారెడ్డి టౌన్: ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని 4 మండలాలకు సంబంధించి ఈ నెల 14న ఎన్నికలు జరగనున్నాయని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ సోమవారం తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే పీవో (ప్రిసైడింగ్ అధికారి), ఏపీవో (అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి)ల శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. గాంధారి, లింగంపేట, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డిలలో 469 మందికి శిక్షణ నిర్వహించామన్నారు.

ఒక సర్పంచ్, 12 వార్డు నామినేషన్లు తిరస్కరణ

కామారెడ్డిటౌన్: కామారెడ్డి డివిజన్ పరిధిలో ఒక సర్పంచ్, 12 వార్డు స్థానాలకు సంబంధించి నామినేషన్లు తిరస్కరణకు గురిఅయినట్లు ఆర్డీవో వీణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేతల.. బుజ్జగింపులు

(5వ పేజీ తరువాయి...)

అభ్యర్థులు భావిస్తున్నారు. ఈ పంచాయతీల్లో గెలుపొందేందుకు అభ్యర్థులు ఎంతైనా ఖర్చుపెడతామనే ధోరణిలో ఉన్నట్లు సమాచారం. పెద్ద పంచాయతీల్లో తమ ఉనికి నిలుపుకోవాలని ప్రధాన పార్టీలన్నీ భావిస్తున్నాయి. తమ పార్టీ మద్దతు ఇస్తున్న వ్యక్తిని గెలిపించుకోవడానికి కష్టపడుతున్నారు. ముఖ్యంగా చిన్నమల్లారెడ్డి, గర్గుల్, ఉగ్రవాయి, భిక్కనూరు, సదాశివనగర్, దోమకొండ, బీబీపేట, రాజంపేట, తాడ్వాయి, తదితర పంచాయతీలలో గెలుపు కోసం ఎంతైనా ఖర్చు చేసేందుకు అభ్యర్థులు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది.

ఎంత ఖర్చయినా.. గెలవాలట!!

చాలారోజుల తర్వాత తమ వర్గానికి రిజర్వేషన్ రావడంతో చాలామంది అవకాశాన్ని వదులుకునేందుకు ఇష్టపడడం లేదు. ఎంత ఖర్చు అయినా గెలువాలనే ఉద్దేశంతో ఉన్నారు. దీంతో గ్రామాల్లో బుజ్జగింపులకు, ప్రలోభాలకు తెరలేపారు. ఒకే పార్టీలో ఉంటున్నవారు ఇద్దరిద్దరు చొప్పున నామినేషన్‌లు వేయడంతో వారిని బుజ్జగించే ప్రయత్నంలో ఆయా పార్టీల ఎమ్మెల్యేలు ముఖ్యనేతలు ఉంటున్నారు. ముఖ్యంగా ఒకేవర్గం నుంచి ఇద్దరు బరిలో ఉంటే తమ వర్గపు ఓట్లు చీలకుండా మరొకరు ఉపసంహరించుకునేందుకు పావులు కదుపుతున్నారు. కొద్దిగా అంగబలం, అర్థబలం ఉన్నవారు ఎంతో కొంత ముట్టజెప్పి నామినేషన్ విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మరోవైపు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు పోటీపడుతున్నారు. పంచాయతీ ఎన్నికల్లో తక్కువ ఓటర్లు ఉంటారు కాబట్టి.. ప్రతీ ఓటు కీలకమని అభ్యర్థులు భావిస్తున్నారు. దీనికి అనుగుణంగా గ్రామాల్లోని పెద్దమనుషులు, కులపెద్దల మద్దతు కోరుతున్నారు. నిజానికి ఎన్నికల రిజర్వేషన్‌లు ఖరారు అయినప్పటి నుంచే పోటీలో ఉండే అభ్యర్థులు విందులు ఏర్పాటు చేసి ఓట్లు కొల్లగొట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

అవగాహనతోనే హెచ్ఐవీ నివారణ

(5వ పేజీ తరువాయి...)

డీఎంహెచ్‌వో విద్యరన్వాల్కర్, ఎయిడ్స్ నివారణ ప్రోగ్రాం అధికారి రాధిక, నోడల్ అధికారి శరత్, ఏఆర్టీ మెడికల్ ఆఫీసర్‌లు స్నేహ, ప్రీతి, మక్బుల్, సాయికిరణ్, ఐసీటీసీ కౌన్సిలర్ నాగరాజు, వైఆర్‌జీకేర్ డీఆర్‌పీ సుధాకర్, వర్థ్ స్వచ్ఛంద సంస్థ ఎంసీ రమేష్, ఎస్ఎస్‌కే మేనేజర్ శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

లింగంపేటలో విద్యార్థుల అవగాహన ర్యాలీ

లింగంగపేట, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): లింగంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రపంచ ఏయిడ్స్ డే సందర్భంగా విద్యార్థులు మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఏయిడ్స్ అంటువ్యాధి కాదని, అసురక్షత సృంగారం, ఏయిడ్స్ ఉన్న వ్యక్తితో రక్తమార్పిడి, సిరంజీల ద్వారా ఏయిడ్స్ వస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ తెలిపారు. ఏయిడ్స్‌ను నివారించడంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన తెలియజేశారు. ఏయిడ్స్ గురించి ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. లెక్చరర్లు దుర్గయ్య, దర్‌సింగ్, అంజయ్య, శ్రీలత, షైమద్, సంధ్యలతో పాటు సిబ్బంది విద్యార్థులు ఉన్నారు.



లింగంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ కళాశాల విద్యార్థులు

తండ్రికి కూతురు అంత్యక్రియలు

కామారెడ్డి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణంలో నివాసం ఉంటున్న రైతు సుదర్శన్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. అతనికి కొడుకులు లేకపోవడంతో పెద్ద కూతురు అంత్యక్రియలు నిర్వహించడంతో కుటుంబీకులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. అతనికి ముగ్గురు కూతుళ్లు. పెద్దకూతురే ముందుండి కర్మకాండను నిర్వహించి తండ్రి రుణం తీర్చుకుంది.





వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలి

కామారెడ్డి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే హాస్టల్ విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని సోమవారం విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు అధికారులకు ప్రజావాణిలో ఏవో అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ఎస్పీవీఎస్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 50 మంది విద్యార్థినులు ఎస్సీ, ఎస్టీ ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లలో ఉంటున్నారని తెలిపారు. ఆ విద్యార్థినులు హాస్టల్ నుంచి సుమారు 2 కి.మీ దూరం నిత్యం పాఠశాలకు నడుచుకుంటూ వెళ్తున్నారన్నారు. మార్గమధ్యంలో సాయంత్రం రద్దీగా ఉండే రోడ్డు దాటుకొని వెళ్లాల్సి వస్తుందన్నారు. ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయన్నారు. విద్యార్థినుల భద్రతా దృష్ట్యా రవాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థి సంఘం జిల్లాధ్యక్షుడు నాగరాజు, టీజేఎస్ జిల్లాధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లాధ్యక్షుడు వినోద్ చౌహాన్ పాల్గొన్నారు.

ఐఐఎస్ఎఫ్ రెండో రౌండ్‌కు ఎంపిక

కామారెడ్డి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఐఐఎస్ఎఫ్ (ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్) రెండవ రౌండ్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సాయిరెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థినులు నిత్యశ్రీ, భవ్యశ్రీలు రూపొందించిన స్మార్ట్ టర్నింగ్ విత్ జీరో టర్నింగ్ రేడియస్ ప్రాజెక్టు సైన్స్ హ్యాక్‌తాన్ విభాగంలో మొదటి దశ పూర్తి చేసుకొని రెండవ దశకు వెళ్లారని తెలిపారు. రెండో దశలో సైతం విజయం సాధిస్తే పంజాబ్‌లోని చండీగఢ్‌లో వీరి ప్రదర్శన ఉంటుందని తెలిపారు. గైడ్ టీచర్‌గా ప్రవీణ్‌కుమార్ వ్యవహరించనున్నారని వివరించారు.



ఎంపికైన విద్యార్థినులు

నిబంధనల ప్రకారం పనిచేయాలి

సదాశివనగర్, డిసెంబరు 1: ఎన్నికల సంఘ నిబంధనల ప్రకారం ప్రిసైడింగ్ అధికారులు పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలన్నారు. తహసీల్దార్ సత్యనారాయణ, మాస్టర్ శిక్షకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సంతోష్‌కుమార్

బాల్యవివాహాలను అరికట్టాలి

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబరు 1: మాదక ద్రవ్యాలు, సైబర్ మోసాలు, బాల్య వివాహాలపై ఎల్లారెడ్డిలోని మోడల్ కళాశాలలో సోమవారం పోలీసు కళాబృంద సభ్యులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటపాటలతో విద్యార్థులకు అర్థమయ్యేలా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మహేష్ మాట్లాడుతూ.. బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ దుష్ప్రభావాలు, నిర్మూలన మార్గాలు, సమాజంపై ప్రభావం వంటి అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడితే దేశ భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. సైబర్ మోసాలకు గురైతే టోల్‌ఫ్రీ నంబర్ 1930కి సమాచారం అందించాలన్నారు. ఆపత్కాలంలో డయల్ 100 సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాబృందం ఇన్‌చార్జి తిరుపతి, శేషారావు, సాయిలు, ప్రభాకర్, ప్రిన్సిపాల్ గాంధీ, అధ్యాపకులు జహంగీర్, ప్రియదర్శిని, లక్ష్మణ్, రాజశేఖర్, బల్వంత్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై మహేష్

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- ఆంధ్రాకింగ్ తాలూకా
ప్రియ 35- రాజు వెడ్స్ రాంబాయి
దర్శన్- జటాధర

బాన్సువాడ

మహేశ్వరి రాజు వెడ్స్ రాంబాయి
వెంకటేశ్వర ఆంధ్రాకింగ్ తాలూకా

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230